www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 22 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8

## పండుగలు సామరస్యానికి ప్రతీకలు



- ఐక్యతతోనే సమాజ పురోగతి
- యువత సామాజిక చైతన్యం అభినందనీయం
- ఎంఎల్ఏ కూనంనేని

2లో

# ఎల్‌నినో తీవ్రత..
# వడబడుతున్న పత్తి..!



- అధిక ఉష్ణోగ్రతలకు పైర్లకు తెగులు
- అననుకూల వాతావరణంలో అల్లాడుతున్న ప్రజలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎల్‌నినో ప్రభావం రోజు రోజుకు తీవ్రమవుతుంది. గడిచిన మూడు, నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపు 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. తీవ్రమైన వర్షపాత లోటు ఉండడంతో వరి సాగు గణనీయంగా తగ్గిపోయింది. చెరువులు, కుంటలు వట్టిపోతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులలోకి నీరు రాలేదు. మెట్ట పంటలు సైతం ఎండలకు మాడిపోతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులను సైతం తట్టుకుంటుందని భావిస్తున్న మిగతా 2లో..

## మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలి

-సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెసల కొనుగోలు పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని ఆయన ఆరోపించారు. సోమవారం మద్దతు ధరకు పెసలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కొణిజర్ల ప్రజావాణి కార్యక్రమంలో ఆందోళన నిర్వహించారు. అధికారుల ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా మిగతా 2లో..

## ఎస్సి, ఎస్టిలకు దామాషా ప్రకారం
# ప్రభుత్వ ఫలాలు అందాలి




-సివిల్ రైట్స్ డేను పకడ్బందీగా నిర్వహించాలి
-ఎస్సి, ఎస్టి కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్సి, ఎస్టి వర్గాలకు దామాషా ప్రకారం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందేలా అధికారులు చొరవ చూపాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కలెక్టర్ దివాకర టిఎస్ , సిసి సునీల్ దత్ లతో కలిసి భూమి సర్వీసెస్ అట్రాసిటీ కేసుల పురోగతిపై ఛైర్మన్ వెంకటయ్య సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి యువత నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం నవంబర్‌లో రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల నివాస ప్రాంతాలకే వెచ్చించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ కోటి రూపాయల బీమా వర్తింపజేయాలన్నారు. గురుకులాల్లో నాణ్యమైన వసతులు కల్పించాలని, ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డేను తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌వోలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం, పరిహారం మిగతా 2లో..

## అక్టోబర్‌లోగా
# యాతాల కుంట టన్నెల పూర్తి

-25రోజుల్లో పనులు పూర్తి చేయాలి : మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ములకలపల్లి:** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను ఎంఎల్ఏ జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. టన్నెల్‌లో మిగిలిన లైనింగ్, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్, రోడ్డు క్రాసింగ్ పనులను 25 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పనులు వేగవంతం చేసి అక్టోబర్‌లోగా టన్నెల్‌ను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మిగతా 2లో..



# ఎల్‌నినో తీవ్రత.. వడబడుతున్న పత్తి

(మొదటిపేజీ తరువాయి)

పత్తి కూడా వడబడిపోతుంది. పూత, కాత దశలో భూమిలో పదును లేక పోవడంతో పత్తి పూత రాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన పంటలపైన అధిక ఉష్ణోగ్రతల ప్రభావం రోజు రోజుకు తీవ్రమవుతుంది. మిర్చి, పత్తి, అక్కడక్కడ బోర్లు, ఇతర నీటి వనరుల క్రింద సాగు చేసిన వరి పొలాలకు సైతం ఎర్ర తెగుళ్ల సోకుతున్నాయి. ఈ ఏడాది వ్యవసాయ రంగం తీవ్ర గడ్డుస్థితిని ఎదుర్కొంటుంది. ఇదిలా ఉండగా అధిక ఉష్ణోగ్రతలతో పాటు తీవ్ర అననుకూల వాతావరణ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఏడు గంటలకే భానుడు భగభగలాడుతున్నాడు. వేసవిని తలపించే రీతిలో ఎండలు వస్తుండడంతో పగటిపూట బయటకు వచ్చే పరిస్థితి లేదు. అననుకూల వాతావరణ కారణంగా ఇటీవల కాలంలో వ్యాధులు ప్రబలుతున్నాయి. తీవ్రమైన జ్వరాలు, గొంతు నొప్పితో పాటు క్రమ క్రమంగా డెంగ్యూ ఉధృతమవుతుంది. పలు చోట్ల డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. అననుకూల వాతావరణం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని వైద్యులు అంటున్నారు. మొత్తంగా ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం అటు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడంతో పాటు



ఇటు వ్యాధులు ప్రబలుతున్నాయి. రానున్న కాలంలో ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరికతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆరోగ్య సమస్యలు వ్యవసాయ రంగంతో పాటు భూగర్భ జలాలు అడుగంటడంతో రానున్న కాలంలో సాగునీటి సమస్యతో పాటు తాగునీటి సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంది.

# పండుగలు సామరస్యానికి ప్రతీకలు

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** పండుగలు సమాజంలో సామరస్యానికి సోతరభావానికి ప్రతీకలుగా నిలుస్తాయని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం, రామాటాకీస్ ఏరియా, పాత కొత్తగూడెం బూడిదగడ్డ తదితర ప్రాంతాల్లో వివిధ ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామిని ప్రార్థించినట్లు చెప్పారు. కులమతాల అంతరాలు లేకుండా అంతా కలిసి జరుపుకునే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెద్ద ఎత్తున బలోపేతం చేస్తాయన్నారు. అధ్యాత్మిక చింతనతో పాటు పరోపకార గుణాన్ని ప్రతొక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. సమాజ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యావంతులై సామాజిక చైతన్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గంలోని ప్రతీ సమస్య పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మండపాల నిర్వాహకులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్ మునిగడప పద్మ, వెంకటేశ్వర్లు, బండి నర్సింహా వీసంశెట్టి విశ్వేశ్వరరావు, సునీత నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు భవాని సాంబిరెడ్డి మల్లేష్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్‌లోగా యాతాల కుంట టన్నెల పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్తుపల్లి ట్రంక్‌కు నీటిని తరలించే భూసేకరణ సమస్యలను దాదాపు పరిష్కరించామని, ఇటీవల రూ 48 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

**అన్నదైవం ప్రాజెక్టుకు నీరు...**

ములకలపల్లి మండలం కమలాపురం పంప్‌హౌస్‌లో మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు మంత్రి తుమ్మల, ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ నీటిని విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపాడేందుకు గోదావరి జలాలను సమర్ధంగా వినియోగించాలని మంత్రి సూచించారు. ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యం పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

**కుమ్మరిపాడులో వంతెన, రహదారి ప్రారంభం...**

ములకలపల్లి మండలం కుమ్మరిపాడులో రూ 4.63కోట్ల ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల అభివృద్ధికి



ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీతారామ ప్రాజెక్టు పనులపై కలెక్టర్, ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్షించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించి పనులు నిలిచిపోకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పెసలు మద్ధతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు పెసలు పండించిన రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరుస్తుందని హేమంతరావు తెలిపారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, దొండపాటి రమేష్, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, సిపిఐ రైతు సంఘం నాయకులు స్వర్ణ రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మునిగే కోటేశ్వరరావు, సీతారాములు, బిఆర్ఎస్ నాయకులు పోట్ల శ్రీనివాసరావు, రాంపూడి సురేష్, గోపాలరావు, నర్సారావు, శ్రీను, అడపా వెంకటేశ్వర్లు, రజాక్, పుల్లయ్య పాల్గొన్నారు.

## ఎస్సి, ఎస్టిలకు దామాషా ప్రకారం

# ప్రభుత్వ ఫలాలు అందాలి

(మొదటిపేజీ తరువాయి)

అందేలా చూడాలన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఏ అంగన్‌వాడీ కేంద్రం ప్రైవేట్ భవనాల్లో ఉండకూడదనే లక్ష్యంతో సొంత భవనాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు జిల్లాలో సుమారు 494 విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలో 797 అట్రాసిటీ కేసుల్లో 930 మంది బాధితులకు గాను రూ. 9.05 కోట్ల పరిహారం చెల్లించామన్నారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ 2017 నుండి నమోదైన 878 కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణా కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా అధికారులు, ఏసిపిలు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన..వంటల పోటీలు

**ప్రజాపక్షం/మధిరః** మధిర మున్సిపాలిటీ పరిధిలోని బాబు సాహెబ్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి కుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ తుమ్మలపల్లి వేమలత, వార్డు కౌన్సిలర్ ములకలపల్లి వినయ్‌కుమార్ సమక్షంలో అన్నప్రాసనలు వంటల పోటీలు నిర్వహించారు.



బాదావత్ తేజానాయక్ అనే పిల్లవాడికి అన్నప్రాసన చేసి తల్లులకు వంటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతికుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణీగా ఉన్న సమయం నుంచి బిడ్డ పుట్టేందుకు టీకాలు ఇవ్వడం, కాన్పు జరిగేంత వరకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో 9వ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ కళ్యాణపు రాణి, గర్భిణీతో ఉన్న తల్లులు, పిల్లలు , ఆయాలు పాల్గొన్నారు.

# భద్రతా చర్యలు తీసుకోవాలి

**- విద్యుత్ అధికారులు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** వినాయక ఉత్సవాలలో భాగంగా చివరి రోజు నిమజ్జనంలో విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం తప్పని సరిగా భద్రాతా చర్యలు తీసుకో



వాలని విద్యుత్ అధికారులు ఎస్ఈ పి. మధుసూధన్‌రావు, ఎస్ఈ మహేందర్‌లు అన్నారు. సోమవారం పట్టణ, మండలంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాల ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. విగ్రహాల నిమజ్జన సమయంలో ఊరేగింపు, విద్యుత్ ప్రమాదాల నివారణ, రూట్ మ్యాప్, విద్యుత్ భద్రతా చర్యలపై చర్చించారు. ప్రమాదాల నివారణ కోసం భద్రతా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. అనంతరం విద్యుత్ సరఫరా, ఎదురవుతున్న సమస్యలపై రైతులను అడిగి తెలుసుకొన్నారు. ఇంకా మెరుగైన విద్యుత్ సరఫరా చేయటానికి తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సూచనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.

# వేతనాలు పెంచాలి

**- ఎస్‌సి, ఎస్‌టి కమీషన్‌కు ఫిర్యాదు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎస్‌సి గురుకులాలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో రికార్డు అసిస్టెంట్స్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాలను పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌సి, ఎస్‌టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటేశ్వర్లుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌టి, బిసి, మైనారిటి మరియు జనరల్ గురుకులాలు, అన్ని డిపార్ట్‌మెంట్‌లలో రికార్డు అసిస్టెంట్స్‌కు రూ. 19,500 ఇస్తున్నారని తెలిపారు.



గత 15 సంవత్సరాలుగా ఎస్‌సి గురుకులంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న మాకు కేవలం 15,600 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, తక్కువ వేతనంతో ఎక్కువ పని చేయటంతో ఒత్తిడికి గురి అవుతున్నామని వాపోయారు. రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు, చాలీ చాలని వేతనాలతో పలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని డిపార్టుమెంట్‌లలో మాదిరిగా మాకు సైతం వేతనాలు పెంచి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేషయ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# పంట తీసుకున్నారు.. పైసలు ఇవ్వట్లే..!

**సీడ్ ఆర్గనైజర్ల చేతిలో సత్తుపల్లి రైతుల అవస్థలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ల చేతిలో సత్తుపల్లి మండల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ విత్తన కంపెనీలు సరఫరా చేసిన ఆడ, మగ విత్తనాలను సాగు చేసిన రైతులు పంటను ఆర్గనైజర్ల ద్వారా కంపెనీకి అప్పగించినప్పటికీ, ఆరు నెలలు గడిచినా లక్షల రూపాయల పంట





డబ్బులు అందలేదని బాధిత రైతులు వాపోతున్నారు. సాగుకు ముందు అధిక దిగుబడి, మెరుగైన ధర వస్తుందని హామీలు ఇచ్చి, పంట చేతికొచ్చిన తర్వాత డబ్బుల కోసం తిప్పించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. సదాశివునిపాలెంకు చెందిన ఓ రైతు తనకు రావాల్సిన మొత్తం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొంటూ అధికారులను ఆశ్రయించాడు. పంట డబ్బులు ఇప్పించాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి, రావాల్సిన పంట డబ్బులు ఇప్పించాలని రైతు కోరుతున్నాడు.

# జన గణనలో బిసి కుల గణన చేయాలి




**-జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి**
**-బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు**

ప్రజాపక్షం/ ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జన గణనలో బిసి కుల గణనను ప్రత్యేకంగా నిర్వహించి ప్రతి బిసి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్‌ను కేటాయించాలని బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో రావుల హన్మంతరావు అధ్యక్షతన బిసి సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిసిల జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదించడంతో పాటు విద్య,ఉద్యోగాలు చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. దేశ వ్యాప్తంగా బిసిలు సాగించిన అనేక ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో జనగణనలో కుల గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని విస్మరించి బిసిలను వంచించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన హౌజ్ హోల్డ్ సర్వే ప్రశ్నావళిలో కులగణనకు స్పష్టమైన ప్రస్తావన లేకపోవడం దుర్మార్గమన్నారు. ప్రశ్నావళిలో ఎస్సి, ఎస్టి, ఇతరులు అనే విభాగాలు మాత్రమే ఉండడంతో బిసి జనాభా వెలుగులోకి వచ్చే అవకాశం లేదన్నారు. ప్రతి బిసి కులానికి ప్రత్యేక గుర్తింపు యూనిక్ కోడ్ కేటాయించి శాస్త్రీయ ప్రణాళికబద్ధమైన పద్ధతిలో జనగణన చేపట్టాలని కోరారు. బిసిల జనాభా లెక్కలు అందుబాటులోకి వస్తే జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో తగిన వాటా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. విద్య, ఉద్యోగ రంగాలతో పాటు చట్ట సభల్లోనూ బిసిలకు జనాభా ప్రాతిపదికన తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. జనగణన ప్రశ్నావళిలో బిసిలకు ప్రత్యేక కాలం ఏర్పాటు చేసిన తర్వాతే దేశ వ్యాప్తంగా జనగణన ప్రక్రియ చేపట్టాలన్నారు. లేని పక్షంలో రాజకీయాలకు అతీతంగా బిసిలంతా సంఘటితమై ఉద్యమిస్తామన్నారు. అక్టోబర్ 21, 22 తేదీలలో హైదరాబాద్‌లో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 10 వరకు సభ్యత్వ నమోదు, గ్రామ కమిటీల ఎన్నికలు, అక్టోబర్ 12 నుంచి 30 వరకు మండల మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ ఒకటిన ఖమ్మంలో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శింగు నర్సింహారావు,జిల్లా ఉపాధ్యక్షులు పగడాల మల్లేష్,కోశాధికారి గాదె లక్ష్మి నారాయణ, సహాయ కార్యదర్శి ఆకెన పవన్ పాల్గొన్నారు.

## ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఆనందంగా, సుభిక్షంగా ఉండాలని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి ఆకాంక్షించారు. వినాయక నవరాత్రుత్సవాల్లో భాగంగా ఖమ్మం నగరంలోని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ప్రధాన కార్యాలయంలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం వత్సవాయి రవి దంపతులు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వత్సవాయి రవి మాట్లాడుతూ తొలిసారిగా తమ కార్యాలయంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నామన్నారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా కుం కుమ, సరస్వతి పూజలను నిర్వహించినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు పడక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలతో పాటు రైతులంతా సుఖ సం తోషాలతో పాటు పంటలు సమృద్ధిగా పండాలని గణనాధుని ప్రార్ధించినట్లు తెలిపారు. వ్యవసా య రంగం బాగుంటే అన్ని రంగాలు బాగుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్‌నర్స్ రేణుక రవి, కార్యాలయ ఇంచార్జి పోగుల రవికుమార్, ఉత్సవ కమిటీ బాధ్యులు శ్రీనివాస రాజు, సాయి కిరణ్, కృష్ణా చౌదరి, నరేష్, మార్కెటింగ్ డైరెక్టర్ షేక్ తాజుద్దీన్, కాసాని శ్రీశైలం, గాలి నారాయణ, వెంకటేశ్వర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## సర్పంచుల సమస్యలను పరిష్కరించండి

**-డిపివోకు సర్పంచుల సంఘం వినతి**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచుల సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి జి. వినోద్‌ను సర్పంచుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్బూరి నరహరి, బానోత్ బిక్షం నాయక్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న నెలవారి గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. డ్వాక్రా సంఘాల సమావేశాలకు సంబంధించిన ఆహ్వానం, ఇతర అంశాలలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను డిపివో దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో సర్పంచులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పలు సమస్యల కారణంగా సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సమస్యల పట్ల డిపివో సానుకూలంగా స్పందించారని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచుల సంఘం ప్రతినిధులు తెలిపారు.

# ఏఐకెఎంఎస్ మహాసభలను జయప్రదం చేయాలి



**-సిపిఐ (ఎంఎల్) ఎన్డి ఆధ్వర్యంలో ప్రదర్శన**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకెఎంఎస్ జాతీయ నాయకులు జెవి చలపతిరావు పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ(ఎంఎల్)ఎన్డి ఆధ్వర్యంలో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఎన్డి కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఎన్నెస్పి రోడ్డు, రైతు బజార్, భక్తరామదాసు కళాక్షేత్రం, ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌజ్, మయూరిసెంటర్, వైరా రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు, గట్టయ్య సెంటర్ మీదుగా డప్పు దళాలు, రెడ్ షర్ట్ వాలంటీర్స్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జెవి చలపతిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు కూలీలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ రాష్ట్రంలో కూడా కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తక్షణమే కరువు సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. తక్కువ, సున్న సుంకాలతో వ్యవసాయ ఉత్పత్తులు దేశంలోకి రావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యయంపై 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని హామీ ఇచ్చిన కేంద్రం దాని ఊసే లేదన్నారు. రైతులకు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రం కుట్రలు పన్నుతుందన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. ఖమ్మంలో ఈనెల 28 నుంచి 30వరకు జరిగే ఏఐకెఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి. కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భిక్షపతి, గైని ఐలయ్య, మాజీ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న, రాష్ట్ర నాయకులు బండారు ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, ఏనుగు చంద్రారెడ్డి, శంకర్, సైదులు, దేవేందర్, సత్యనారాయణ, ఆదిలక్ష్మి, ప్రకాష్, రామిరెడ్డి, అనురాధ, మంగ, గిరి, రాజేంద్రప్రసాద్, లక్ష్మి నారాయణ, రమేష్, కిషన్, నాగన్న, వెంకన్న, జానకి, లక్ష్మి, మోహన్‌రావు పాల్గొన్నారు.

## పెండింగ్ మెస్ చార్జీలు వెంటనే చెల్లించాలి




ప్రజాపక్షం/సత్తుపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ మెస్ చార్జీలు, కేంద్ర ప్రభుత్వం అందించే రూ.1,000 వేతనాన్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం సత్తుపల్లి మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ పెండింగ్ అల్పాహార బిల్లులు చెల్లించాలని, హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని అల్పాహార పథకాన్ని నిలిపివేసి వంట కార్మికుల ద్వారానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేసి, ఎన్నికల హామీ మేరకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, షేక్ రహీమ్సిన, కుంట వెంకమ్మ, మహాదేవ లక్ష్మి , కారం నాగలక్ష్మి , పూచి సీత, రత్నమాల, రాఘవమ్మ, సత్యవతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయి. ఎంత మేర నిర్మాణ పనులు పూర్తయ్యాయి, పనుల పురోగతిని కమిషనర్ పరిశీలించారు. లబ్దిదారులకు ఇండ్ల నిర్మాణంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో నిర్మించనున్న దావాఖానా, కమ్యూనిటీ హాల్, పార్కు, అంగన్‌వాడీ కేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్, ఇతర మౌలిక వసతుల కోసం కేటాయించిన ప్రదేశాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఈఈ శ్రీనివాసులు, కెఎంసి ఈఈ మురళీ, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

## మండల క్రీడల్లో బాణాపురం పాఠశాల ఓవరాల్ ఛాంపియన్

**- 8విభాగాల్లో పతకాలు**
**- జిల్లా స్థాయి పోటీలకు 20మంది క్రీడాకారుల ఎంపిక**



ప్రజాపక్షం/ముదిగొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముదిగొండ మం డల స్థాయి క్రీడా పోటీల్లో బాణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని 13పాఠశాలలకు చెందిన క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఈ మేరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాణాపురం పాఠశాల విద్యార్థులు మొత్తం 8విభాగాల్లో పతకాలు సాధించి మండల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు. సీనియర్, జూనియర్ బాలికల వాలీబాల్, సీనియర్, జూనియర్ బాలుర వాలీబాల్, సీనియర్ బాలుర కబడ్డీలో విజేతలుగా నిలిచారు. సీనియర్, జూనియర్ బాలికల ఖోఖో, సీనియర్ బాలుర ఖోఖో విభాగాల్లో రన్నరప్‌గా నిలిచారు. ఈ విజయాలతో పాఠశాలకు చెందిన20మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మండల స్థాయి పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరామి రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు జిల్లా స్థాయిలోనూ ఇదే స్ఫూర్తితో రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## గణేష్ మండపాలను దర్శించుకున్న సండ్ర



ప్రజాపక్షం/సత్తుపల్లి: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య సత్తుపల్లి పట్టణంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాస థియేటర్ రోడ్, బైపాస్ రోడ్, తుమ్మూరు రామారావు వీధి, జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్ ప్రాంతాల్లోని మండపాలను దర్శించారు. అంబేద్కర్‌నగర్‌లో ముత్యాలమ్మ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులతో కలిసి పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సండ్ర మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, అంకమరాజు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు భద్రత కల్పించండి

ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో గల ఎస్టీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలుర హాస్టల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. .బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోత్ విజయ్ ఆధ్వర్యంలో హాస్టల్ పరిసరాలను పరిశీలించి, మున్సిపల్ అధికారులు తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, టౌన్ ప్రధాన కార్యదర్శి మందా శివ యాదవ్, పాలకొల్లు శ్రీనివాస్, సాయి వర్ధన్, వెదుళ్ల వీరబాబు, బండి ఆంజనేయులు, బట్టి శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

# పండుగలు ఐక్యతను పెంపొందిస్తాయి



**- గణపతి మండపాలను సందర్శించిన ఎంఎల్‌ఏ కూనంనేని**

ప్రజాపక్షం/పాల్వంచ : పండుగలు ప్రజల మధ్య ఏకత్వాన్ని, ఐక్యతను, మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి పలు డివిజన్‌లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సోమవారం సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంఎల్‌ఏ, సాబీర్‌పాషా, మేయర్‌లను ఘనంగా సన్మానించారు. ముందుగా కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ 6వ, డివిజన్ కార్పోరేటర్ సింధు తపస్వి ఎంఎల్‌ఏకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పే విధంగా ఉండాలన్నారు. గణనాధుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ:శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను అందరికి ఆనందాన్ని కలిగేలా నిర్వహించాలని, ప్రతీ ఒక్కరు పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని కోరారు. యువత పరస్పర సహకారంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. కులమతాలను గౌరవిస్తూ అన్నిమతాలను సమానంగా చూడటమే నిజమైన భక్తి అని తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పండుగలు చేసుకోవాలని, తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు చేసిన భక్తులు నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, సేవా దృక్పథంతో ఆదర్శవంతమైన సమాజ కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు, సిపిఐ నాయకులు ఆదినారాయణ, బాబూరావు, లాల్‌పాషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ చట్టాల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు




**-జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలి**
**-డా మిడియం బాబురావు**

ప్రజాపక్షం/ములకలపల్లి: ఆదివాసీ చట్టాల పరిరక్షణకు ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా మిడియం బాబురావు పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్యనగర్‌లో జరిగిన సంఘం జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలను ఎకధ్ధందీగా అమలు చేయాలని, జీఓ నంబర్ 3ను వెంటనే పునరుద్ధరించాలని, మిగిలిన పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులపై అటవీ అధికారుల దాడులు నిలిపివేయాలని కోరారు. ఆదివాసీ యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జీఓ నంబర్ 3 పునరుద్ధరణపై ఆదివాసీ ఎంఎల్‌ఏలు అసెంబ్లీలో స్పందించాలని, శిరీష ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య, సోయం జోగారావు, గౌరీ నాగేశ్వరరావు, మడివి రమేష్, సోడెం ప్రసాద్, సర్పంచులు వగ్గెల రాధ, గంపా సుజాత, మాజీ సర్పంచ్ కుంజా భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## మహా అన్నదానం



ప్రజాపక్షం/గుండాల : గణేష్ ఉత్సవకమిటి ఆధ్వర్యంలో బతుకమ్మగాట్ వద్ద వరసిద్ధి వినాయక మండపం వద్ద గణేష్ నవరాత్రుల ఉత్సవాలలో బాగంగా ఏనిమిదోరోజు మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఎస్సై శ్రావన్ కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ కమిటిసభ్యులు గణనాదుని నిమజ్జన సమయంలో తగుజాగ్రతలను పాటించాలన్నారు. కమిటి సభ్యులు వి, నరేష్, రవి, పవన్, రమేష్, చంద్రాచారి, పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ఇల్లందు: ఖమ్మంలో సెప్టెంబర్ 28,29,30 తేదీలల్లో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)నాలుగో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఉమ్మడి శెట్టిపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు బచ్చల సారయ్య జెండా ఊరి ర్యాలీని ప్రారంభించారు. రేగులగూడెం, శెట్టిపల్లి, పెద్ద చెలక, నల్లచెలక, గోరకలమడుగు, శంభునిగూడెం, వెన్నెలబైలు, సర్వాపురం గ్రామాల్లో ర్యాలీ సాగింది. అనంతరం బచ్చల సారయ్య, ఏఐటీఎఫ్ జిల్లా నాయకుడు ఇర్ప రాజేష్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మొక్కజొన్న క్వింటాకు రూ 3వేలు, పత్తికి రూ 15వేలు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తప్పెట్ల రాములు, పెంటయ్య, మల్యాల మల్లేష్, శీలం యాదయ్య, కల్తీ మల్లయ్య, ముచ్చ మధు, కాన బోయిన ఉపేందర్, ఇర్ప రమేష్, పొడుగు జార్జ్, కిన్నెర కృష్ణ, పూనేం రాంబాబు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/గుండాల : మండలకేంద్రంలో పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కె ఖదీర్ ఒక లక్షా నలబైవేల చెక్కులను లబ్దిదారుకు సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఊకె బుచ్చయ్య, సర్పంచులు ఈసం సంజీవరావు, కల్తి క్రిష్ణవేణి, కల్తి క్రిష్టారావు, మండల నాయకులు భూక్య శ్రీను, రమేష్, చంద్రశేఖర్, రాజేష్, పల్లపు రాజేష్, పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో రెగ్యులర్ వైద్యులను నియమించాలి



ప్రజాపక్షం/గుండాల : గుండాల ప్రాథమిక వైద్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని , నెలరోజులుగా ఇన్‌చార్జి వైద్యులను నియమించడంతో వారం సక్రమంగా విధులకు హాజరుకాక రోగులు నాన ఇబ్బందులు పడుతున్నారని సోమవారం నవచైతన్య యువజన సంఘం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ యాస్పిరేషన్ బ్లాక్ లో ఉన్న ఆస్పత్రిని జిల్లా వైద్యాదికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. గిరిజన గ్రామాలలో వైరల్ ఫివర్స్‌తో చిన్నలు,పెద్దలు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని , ఇక్కడ స్థానికంగా వైద్యులు అందుబాటులో లేక వైద్యంకోసం అప్పులు చేసుకొని పట్టణాలకు తరలి వెలుతున్న దుస్థితి మండలంలో ఉందన్నారు. ఆస్పత్రిలో ఉన్న నర్సులు తనస్థాయిలో వైద్యం చేసి మెరుగైన వైద్యంకోసం పట్టనాలకు రిఫర్ చేయడం పరిపాటిగా ఇక్కడ మారిందన్నారు. ఏజెన్సి మండల వైద్య సదుపాయాలపై పాలకులుగాని, జిల్లా అధికారులు స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రాథమిక వైద్యకేంద్రంలో రెగ్యులర్ వైద్యులను నియమించి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేవిదంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులను కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వినయ్, సంతోష్, శోభన్, సతీష్, చరన్ పాల్గొన్నారు.

## శిలాఫలకానికే పరిమితమైన బ్రిడ్జి నిర్మాణం



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండలంలోని సీతాయిగూడెం గ్రామానికి వెళ్లే రహదారిపై బ్రిడ్జి నిర్మాణం శంకుస్థాపనకి పరిమితమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ సంయుక్తంగా శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని చెబుతున్నారు. సీఆర్‌ఆర్ గ్రాంట్లతో పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ 3.20కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు టెండర్లు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు త్వరగా నిర్మాణం పూర్తవుతుందని ఆశించిన ప్రజలకు జాప్యం నిరాశ కలిగిస్తోందని అంటున్నారు. శంకుస్థాపన చేసిన పనులపై మంత్రి, ఎంఎల్‌ఏలు ప్రత్యేకంగా దృష్టి సారించి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఏడాదిన్నరగా పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## పర్ణశాలలో వినాయక నిమజ్జనానికి అనుమతి



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: పర్ణశాల గోదావరి తీరంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనుమతిపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. స్థానిక ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం పర్ణశాలకు చేరుకుని అధికారులతో మాట్లాడి నిమజ్జనానికి అనుమతి కల్పించేందుకు చొరవ తీసుకున్నారు. నిమజ్జన కార్యక్రమానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎంఎల్‌ఏ ఆదేశించారు. నిమజ్జనాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని సూచించారు.

## చందా నాయక్‌కు నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: సీపీఐ భాగ్యనగర్ గ్రామ శాఖ మాజీ కార్యదర్శి గుగులోత్ చందా నాయక్ పార్థివదేహానికి సీపీఐ నాయకులు పూలమాల, పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర గిరిజన సమాఖ్య కార్యవర్గ సభ్యుడు బానోత్ ఈరు నాయక్, జిల్లా సమితి సభ్యుడు చెన్నంశెట్టి భూషయ్య, ఇల్లందు మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె వలీ, భాగ్యనగర్ శాఖ కార్యదర్శి ఇస్లావత్ భవసింగ్, సహాయ కార్యదర్శి వంకుడోత్ శ్రీకొలియా, సింగరేణి మండల కార్యవర్గ సభ్యుడు వాంకుడోత్ హరిసింగ్, ఏఐటీయూసీ నాయకులు గుగులోత్ రావుజీ, గుగులోత్ రవి, ఇస్లావత్ దళ్‌సింగ్(బాబు), ఏఐవైఎఫ్ నాయకులు గుగులోత్ బాలకిషన్, సపావత్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి సొసైటీ మాజీ ఛైర్మన్ గురవయ్య మృతి



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి సొసైటీ మాజీ ఛైర్మన్, విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వల్లభనేని గురవయ్య(83) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురవయ్య మృతికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సీ తాతా మధు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాన్ని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు భాగం హేమంతరావు, గాంధీ, డీసీసీబీ మాజీ ఛైర్మన కూరాకుల నాగభూషణం, సొసైటీ ఛైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సీపీఎం నాయకులు రేగళ్ల మంగయ్య, సైదులు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

## గణేష్ మండపాల్లో దిండిగల పూజలు





ప్రజాపక్షం/ఇల్లందు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇల్లందు పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ 12వ వార్డుతో పాటు నంబర్ 2, భజన్ మందిర్, కోర్టు ఏరియా బస్తీ, కరెంట్ ఆఫీస్ అలమటి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను బీఆర్ఎస్ ఫౌండర్ మెంబర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ సందర్శించారు. ఆయా ఉత్సవాల కమిటీల ఆహ్వానం మేరకు మహా అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండి జాఫర్, బీఆర్ఎస్ పట్టణ నాయకులు నారపాక వసంత్, పరకపల్లి రవిగౌడ్, అమీర్, మండల నాయకులు సూర్ణపాక సత్యనారాయణ, భావసింగ్, మానియా కె శ్యామ్, ముల్లగుండ్ల ఉపేందర్, యువజన నాయకుడు మునిగంటి శివ, తెలంగాణ ఉద్యమకారుడు రాంలాల్ పాసి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల ప్రవేశాలను అడ్డుకుంటే సహించం




**-విద్యార్థులను వేదిస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పేద విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలను దెబ్బతీస్తూ వారిని తీవ్ర మానసిక వేదింపులకు గురి చేస్తున్న ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల పేరుతో విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అదనంగా రూ. 15వేలు చెల్లించాలని వేదించడాన్ని నిరసిస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్, ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ సెల్ఫ్ ఫైనాన్స్ పీజీ కోర్సుల పేరిట అదనపు మొత్తాన్ని డిడిల రూపంలో చెల్లించాలని పేద విద్యార్థులపై ఒత్తిడి తీసుకు రావడం అన్యాయమన్నారు. ఫీజులు చెల్లించలేమన్న విద్యార్థులకు ప్రవేశాలు నిరాకరిస్తూ ప్రిన్సిపాల్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థి సంఘాల ఆందోళన ఉధృతం కావడంతో ప్రిన్సిపాల్ నాయకులతో చర్చలు జరిపారు. అదనపు డిడి చెల్లింపును తాత్కాలికంగా వాయిదా వేసి విద్యార్థుల అడ్మిషన్లను స్వీకరించేందుకు ప్రిన్సిపాల్ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్, జిల్లా ఉపాధ్యక్షులు శివనాయక్, జిల్లా సహాయ కార్యదర్శి మధు, నాయకులు రాజు, రమ్య, సరస్వతి, పావని పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి నిరంతర విద్యుత్ సరఫరా

**-విద్యుత్ సరఫరా ఎస్ఈ శ్రీనివాసాచారి**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఈనెల 23న జరగనున్న వినాయక నిమజ్జనోత్సవానికి నిరంతరాయం సురక్షిత విద్యుత్ సరఫరాకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. నిమజ్జన కేంద్రాలు, ప్రధాన ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ లైన్ల క్రింద విగ్రహాలు సురక్షితంగా వెళ్లేలా అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఊరేగింపు మార్గాలలో విద్యుత్ అడ్డంకులను ముందుగానే తొలగించాలని ఫీల్డ్ సిబ్బందిని ఆదేశించామన్నారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూము ఈనెల 23న ఉదయం తొమ్మిది గంటల నుంచి 24వ తేదీ ఉదయం ఏడు గంటల వరకు నిరంతరం పని చేస్తుందన్నారు. అత్యవసర సేవలు, ఫిర్యాదుల కోసం ప్రజలు 8712483490 లేదా టోల్ ఫ్రీ నెం. 1912ను సంప్రదించాలన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు విద్యుత్ భద్రత నిబంధనలు పాటిస్తూ సిబ్బందికి సహకరించాలని ఎస్ఈ కోరారు.

# త్వరలోనే విద్యార్థులకు అల్పాహారం

**తుంబూరు దయాకర్‌రెడ్డి**






**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** విద్యార్థులకు అల్పాహారం అందిచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం త్వరలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో పాలేరుని యోజకవర్గానికి రాబోతోందని మంత్రి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలంలోని ఎం,వెంకటాయపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థుల కోసం పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. తొలుత హాజరైన తుంబూరు దయాకర్‌రెడ్డిని పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు మ్యూజిక్ కొడుతూ పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రిబ్బన్‌ను విద్యార్థిని కట్ చేపించి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ...విద్యార్థుల ఆరోగ్యానిన దృష్టిలో పెట్టుకొని పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలేరునియోజకవర్గంలో ఇప్పటికే 22 మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేగినాటి విజయ్, మాజీ సర్పంచ్ తుమ్మల సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం, కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, కళ్లెం వెంకట్‌రెడ్డి, అజ్మీరా అశోక్ నాయక్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పంతుల్ నాయక్, మండలకాంగ్రెస్ నాయకులు మందపల్లి నాగమణి, లింగా శ్రీనివాస్, పాపిట్ల శ్రీను, కాంగ్రెస్ యువజన నాయకులు గుర్రం రాకేష్‌రెడ్డి, బోయిన సాయి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఎమ్మెల్ పార్టీ నాయకుడు మందాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారంలో చోరీ కలకలం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని ముత్తారం గ్రామంలో సోమవారం ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు సమాచారం రావడంతో స్థానికంగా కలకలం నెలకొంది. గ్రామానికి చెందిన లంజపల్లి విజయ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంటి యజమానులు విషయాన్ని గుర్తించిన అనంతరం పోలీసులకు సమాచారం అందించినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. ఇంట్లోని వస్తువుల పరిస్థితి, తలుపులు లేదా ఇతర ప్రాంతాల్లో చోరీకి సంబందించిన, ఆనవాళ్లు ఉన్నాయా? అనే కోణంలో పరిశీలన చేసినట్లు తెలిసింది. అయితే ఇంట్లో నుంచి నగదు, బంగారు ఆభరణాలు లేదా విలువైన వస్తువులు ఏమైనా చోరీకి గురయ్యాయా?అనే విషయంపై ప్రస్తుతం స్పష్టమైన సమాచారం లేదు. చోరీకి గురైన వస్తువుల వివరాలు, వాటి విలువపై కుటుంబ సభ్యుల నుంచి పూర్తి సమాచారం అందిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు సేకరిస్తూ ధర్యాప్తు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, చోరీ జరిగిన తీరుపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఘటనపై పూర్తి వివరాలు పోలీసులు ధర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. పోలీసులు ధర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో చోరీకి గురైన వస్తువులు, నష్టం విలువ వంటి వివరాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

# కాంగ్రెస్ రాజ్యంలో కౌరవ పాలన

**- బోనకల్‌లో బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం**





**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ బిఆర్ఎస్ నూతన మండల పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో బోనకల్ పట్టణం గులాబీమయమైంది. బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు ముఖ్యఅతిధిగా పాల్గొని నూతన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రావినూతల నుండి బోనకల్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీతో పురవీధులు హోరెత్తాయి. గులాబీ జెండాలు రెపరెపలాడతుండగా పార్టీ నినాదాలతో ప్రధాన వీధులు మర్మోగాయి. అనంతరం జరిగిన సభలో కమల్‌రాజు మాట్లాడుతూ బోనకల్‌లో ప్రారంభించిన బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకు పరిమితమైన కార్యాలయం కాదని, ప్రజల కోసం పనిచేసే జనతా గ్యారేజ్, ప్రజా సమస్యలపై పోరాడే పోరాట కేంద్రంగా ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు. ప్రజలు తమ సమస్యలతో ఎప్పుడైనా పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిపై అవసరమైన పోరాటాలు నిర్వహించేందుకు ఈ కార్యాలయం కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రజలను నయవంచన చేశారని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి పనుల పేరుతో కమీషన్లతో కాలం గడుపుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలు, రైతులు, యువత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం మరిత స్పష్టతతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్‌రాజ్యంలో కౌరవ పాలన సాగుతుందని, బిఆర్ఎస పాలనలో స్వర్ణయుగం నడిచిందన్నారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ ప్రజలు కేసిఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారని అన్నారు. కేసిఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# డీజే సీజ్.. ఇద్దరిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/చింతకాని :** రామకృష్ణాపురంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డీజే సౌండ్‌ను చింతకాని పోలీసులు సోమవారం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. గణేశ్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతులు లేవని ఎస్సై జి నరేష్ తెలిపారు. విగ్రహాల ఊరేగింపులో బాణసంచా కాల్చరాదని సూచించారు. ఊరేగింపుల్లో చిన్నారులు, మహిళల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని , మద్యం సేవించి గొడవలకు దిగడం, పాతరాజకీయ వివాదాలను రెచ్చగొట్టడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# విద్యార్థి గుడిపూడి ఉపేందర్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/మధిరః** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ప్రతిభతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించిన పేద కుటుంబానికి చెందిన విద్యార్థి గుడిపూడి ఉపేందర్‌ను సోమవారం ఖమ్మంపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రారెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ బి.అంజనబాబు, ఉపాధ్యాయులు రేగళ్ల బ్రహ్మారెడ్డి, మదార్, సునీత, జమీర్, గ్రామ పెద్దలు రామారావు, జానయ్య బాలు, పాత్రికేయులు మువ్వా మురళి పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆయుర్వేద దినోత్సవ పూర్వ వేడుకలు



**ప్రజాపక్షం/మధిరః** మధిర ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం మధిర మున్సిపాలిటీ ఇల్లందులపాడులో ఆయుర్వేద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల23న ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం జరగనున్న నేపద్యంలో ఈ వేడుకలను చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాలుగు వేదాల్లో ఒకటైన ఆయుర్వేదం ఎలాంటి కోత, కుట్టు లేకుండానే మానవ శరీరంలోని రుగ్మతలను తొలగించి పరిపూర్ణ దీర్ఘాయుష్షను ప్రసాదిస్తుందని కొనియాడారు. నేడు ప్రపంచ దేశబూాల నడుమ భారతదేశ కీర్తిప్రతిష్టలు నలుదిశలా వ్యాప్తి చెందడానికి నాటి నుంచి మనం ఆచరిస్తూ వస్తున్న ఆయుర్వేద సూత్రాలు కూడా ఒక ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే సహజసిద్ధమైన ఔషధాలను ఉపయోగించి ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా వైద్యం అందించడంతో పాటు విరిగిన ఎముకలను, సైతం సహజ పద్ధతిలో అతికించడం మన ఆయుర్వే వైద్య విధానానికి మాత్రమే సాధ్యమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వెంకట్‌లాల్, డాక్టర్ పృధ్వినాయక్, కాంగ్రేస్ నాయకులు సామినేని రామనాథం, సూర్యదేవర కోటేశ్వరరావు, ఎర్రగుంట రమేష్, కోట డేవిడ్, తాళ్లూరు రాధాకుమార్, కందుల రాంబాబు, ఎస్‌డి.అన్వర్, గణేష్‌బాబు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# దోర్నాల రామకృష్ణకు ఉత్తమ సేవా పురస్కారం



**ప్రజాపక్షం/మధిరః** సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్‌కె ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ దోర్నాల రామకృష్ణకు భారత్ రక్తదాన్ ఉత్తమ సేవా పురస్కారం2026 లభించింది. తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని పిఎస్. ఫంక్షన్ హాల్‌లో ఆదివారం భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన రక్తధాతలు, సామాజిక సేవకులకు ఉత్తమ సేవా పురస్కారాలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌కె ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ దోర్నాల రామకృష్ణ, ఉత్తమ సేవా పురస్కారం 2026ను అందుకున్నారు. డాక్టర్ దోర్నాల రామకృష్ణ మధిర పట్టణంలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రులకు తరలించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తధాతల సహకారంతో రక్తాన్ని అందిస్తున్నారు. సామాజిక సేవా రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించడం తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా మరింత మంది నిరుపేదలు, అనాధలు, ఆపదలో ఉన్నవారికి సేవ చేయడానికి కృషి చేస్తానని డాక్టర్ దోర్నాల రామకృష్ణ తెలిపారు.

